ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



## (జిన్నూరులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 25-8-97)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ఈరోజు కృష్ణాష్టమి. భగవంతుడు అనేక అవతారములు ధరించి ఈ భూమి మీదకు వచ్చాడు. అందులో కృష్ణావతారం శక్తివంతమైనది. కృష్ణుడు ఎక్కడున్నా హస్తినాపురంలోఉన్నా, ద్వారకలోఉన్నా బృందావనంలో ఉన్నా ఒకేలాగ ఉండేవాడు. బాల్యంలో, యవ్వనంలో, వృద్ధాప్యంలో ఒకేలాగ ఉండేవాడు. అదీ జ్ఞానం యొక్క వైభవం. ఆయన చాలాపనులు చేసాడు అన్నింటికంటే అనేక మంచిమాటలను మానవజాతికి బోధించినటువంటి మహాగురువు, మహాజ్ఞాని. మనకు ప్రతీచిన్న విషయానికి టెన్షన్ వచ్చేస్తుంది. ఇంటిదగ్గర ఒకలాగ ఉంటాము, సమాజంలో ఒకలాగ ఉంటాము, అత్తవారి ఇంటిదగ్గర ఒకలాగ ఉంటాము, పుట్టింటి దగ్గర ఒకలాగ ఉంటాము ఇలా రకరకాలుగా మనం జీవిస్తాము. కాని కృష్ణుడు దగ్గర మనం నేర్చుకోవలసినది ఏమిటి అంటే ఆయన ఇంటిదగ్గర ఎలా ఉన్నాడో, బయట అలాగే ఉంటాడు, యుద్ధభూమిలో కూడ అలాగే ఉంటాడు. ఆయనలో ఎక్కడ టెన్షన్‌లేదు. కృష్ణుడు అనేక యుద్ధాలు చేసాడు. భోజనం చేసేటప్పుడు ఎంత ప్రశాంతముగా ఉంటాడో యుద్ధం చేసినప్పుడు కూడా అంత ప్రశాంతముగా ఉండేవాడు. ఎప్పుడూ టెన్షన్‌కు గురికాలేదు. ఇల్లు, యుద్ధభూమి ఒక్కటే ఆయనకు. అంత ప్రశాంతముగా జీవించాడు. ఆయన యుద్ధభూమిలో చెప్పిన శాస్త్రము భగవద్గీత.

మీ హృదయంలో ఉన్న సత్యానికి రూపంలేదు, నామంలేదు. రూపం, నామంలేని దానిని మనం డైరెక్టుగా పట్టుకోలేము. అందువలన నామాన్ని స్మరించటం, రూపాన్ని ధ్యానించటం. భగవంతుని నామమును స్మరించగా, స్మరించగా నీమనస్సు నీకు స్నేహితునిగా మారిపోతుంది. మనం చనిపోయినపుడు శరీరం మనకూడారాదు, మన మనస్సు మనకూడా వస్తుంది. అందువలన మనస్సును పవిత్రం చేసుకోవాలి. మానవుడికి ఎంత ఇంద్రియనిగ్రహంఉందో, ఎంతమనోనిగ్రహం ఉందో అంత తొందరగా జ్ఞానం కలుగుతుంది. తెలివైనవారికి జ్ఞానం కలుగుతుంది అని ఎక్కడ శాస్త్రము చెప్పలేదు. మీకు శారీరకంగా ఎంతబలంఉన్నా, మికు ఎంత ధనంఉన్నా, మీకు ఎంత తెలివి ఉన్నా మీకు ఇంద్రియనిగ్రహము, మనోనిగ్రహము కలుగదు. మీకు ఉన్న తెలివితేటలకు నిగ్రహానికి, మీకు ఉన్న ధనానికి నిగ్రహానికి సంబంధంలేదు. ఇంద్రియనిగ్రహానికి, మనో నిగ్రహము అనేది కేవలము ఈశ్వరుని కరుణవలన, నీసాధన వలన వస్తుంది. నీకు ఆత్మభావన లేకపోతే, దైవభావన లేకపోతే నీవు సాంఘికంగా, ఆర్థికంగా ఎంత పెద్దవాడివి అయినా ప్రకృతి నీకు దారి ఇవ్వదు. జనన మరణ చక్రంలో నుండి బయటకు రాలేవు. నీ ఆలోచన ఉన్నతంగాను, ఉదాత్తంగాను ఉండాలి. దైనందిన జీవితంలో నీవు క్రమశిక్షణ కలిగి ఉంటే, నీ జీవితానికి ఒకరీతి, నీతి ఉంటే నీవు ఉన్నతంగా ఆలోచించగలవు. క్రమశిక్షణ, నీతి, రీతి లేకపోతే నీవు ఉన్నతంగా ఆలోచించలేవు.

మనస్సుకు నిర్మలత్వం రావాలి, ఏకాగ్రతకలగాలి. మనోనిగ్రహం లేనివానికి ఆత్మభావన కలుగదు. ఆత్మభావన లేనివానికి ఆత్మజ్ఞానం కలుగదు. నువ్వు బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవాలంటే డబ్బుకావాలి. అదే విధంగా నీకు జ్ఞానం కావాలంటే నిర్మలమైన అంతఃకరణం కావాలి. ఎక్కడో తెలియని విషయం గొడవ వద్దు. భగవంతుని గురించి మీకు తెలియటంలేదు, మీ మనస్సు గురించి మీకు తెలుస్తోంది కదా మనస్సును  నిర్మలంగా ఉంచుకోండి. మరణం అంటే మనకు భయం వేస్తోంది. భగవంతునికి తెలియకుండా మరణం రావటంలేదు. ఆయన అజ్ఞలేకపోతే మనకు మరణంరాదు. మనచైతన్యస్థాయి పెంచుకోవటానికి ఇంతకంటే అనుకూల పరిస్థితులలోనికి తీసుకొని వెళ్ళటానికి మనకు మరణం ఇస్తున్నాడు అని మనకు తెలియకపోవటం వలన మనకు భయం కలుగుతుంది.

కొంతమంది పరుషంగా మాట్లాడతారు. మాట మాటకు కోపం, చిరాకు తెచ్చుకొంటారు. వాక్కు తపస్సు ఉండాలి. వేదంలో చెప్పిన మాటలు, మహాత్ములు చెప్పిన మాటలు సహాయంతో భగవదనుభవం పొందాలి. భగవంతుడు చెప్పిన మాటలను భగవంతునితో సమానంగా చూసుకోవాలి. ఆ మాటలు యొక్క బరువు తెలుసుకొని, ఆమాటల విలువ తెలుసుకొని అది మీ హృదయంలో పెట్టుకొంటే ఆ మాటలు మిమ్మల్ని ఉన్నత స్థితికి తీసుకొని పోతాయి. షేక్స్పియర్ ఒక డ్రామలో ఒక యాక్టర్ చేత చెప్పిస్తాడు. ఎక్కడో దేవుడు వరకు వెళ్ళనక్కరలేదు. పవిత్రమైన మనస్సుగలవాడిని, శుద్ధి అయిన బుద్ధి కలవాడిని ఒకడిని మీరు నాకు చూపించండి. మీ ఇంటిలో మీరు బంగారమును ఎంత జాగ్రత్తగా దాచుకొంటున్నారో అలాగ వాడిని నా హృదయంలో పెట్టుకొని ఆరాధిస్తాను అని చెప్పాడు. దీని వలన ఏమౌతుంది అంటే వాడు ఆరాధించే మనిషి ఎంత పవిత్రుడో వీడి మనస్సుకూడా అంత పవిత్రం అవుతుంది. అని చెప్పటం కోసం షేక్స్పియర్ ఈ మాటలు చెప్పాడు.

కొంతమంది వారు శాంతిగా ఉండరు, ఇతరులను శాంతిగా ఉండనివ్వరు. అలాకాదు నీమనస్సును నిర్మలంగా ఉంచుకో, పవిత్రంగా ఉంచుకో నీ బుద్ధిని శుద్ధి చేసుకో. బుద్ధి శుది కాకపోతే బుద్ధి స్థిరపడదు. స్థిరపడిన బుద్ధికే ఆత్మభావన కలుగుతుంది. ఆత్మభావన కలిగినవాడికి ప్రకృతి దారి ఇస్తుంది. ప్రకృతి దారిఇచ్చిన వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. వాడు మరణాన్ని జయించి బయటకు వస్తాడు. నీ మనస్సు నిర్మలంగా అవ్వకపోతే, పవిత్రం అవ్వకపోతే నీకు జ్ఞానం వచ్చే అవకాశంలేదు. నీ తెలివి వలన నీ మనస్సుకు పవిత్రత రాదు, నీబుద్ధి శుద్ధి అవ్వదు. భగవంతుని స్మరించటం వలన, ధ్యానం చేయటం వలన, సత్పురుషుల సహవాసం వలన నీబుద్ధి శుద్ధి అవుతుంది, నీ మనస్సు అణుగుతుంది. నీవు భగవంతుని ధ్యానం చేయకపోతే నీకు ఎన్ని తెలివితేటలు ఉన్నా నీ మనస్సు, ఇంద్రియాలు బాహ్యముఖానికి వచ్చేస్తాయి. నీవు ఎన్ని వ్రతాలు చేసినా, ఎన్ని నదులలో మునిగిన నీమనస్సును శాంతిగా ఉంచుకోవటం గొప్పది. నీ మనస్సులో కలవరం లేకపోతే అప్పుడు నీ మనస్సు దైవాభిముఖంగా ప్రయాణం చేయుటం ప్రారంభిస్తుంది.

నీవు ఏగురువును ఆశ్రయించినా, నీవు ఏమతంలో ఉన్నా, నీ ఉపాసనా పద్ధతి ఏదైనా ఆత్మసాక్షాత్కారము అనేది నీ హృదయంలోనే పొందాలి. పొందవలసిన వస్తువు నీ హృదయంలోనే ఉంది. నీ మనస్సుకంటే, నీ ఇంద్రియాలకంటే అత్యంత సమీపంగా ఉంది. అంతేకాదు అది నీవై ఉన్నావు. కాని ఇప్పుడు అది నీకు తెలియదు. ఏ వస్తువును తెలుసుకోవటానికి నీవు ప్రయత్నం చేస్తున్నావో అది నీవే

అన్న సంగతి ఆ వస్తువును తెలుసుకొన్నాక నీకు తెలుస్తుంది. నీవు శరీరంలో ఉండగానే హృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవచ్చు. మనలను మనం ఎక్కువగా ప్రేమించుకొంటే లోకాన్ని తక్కువుగా ప్రేమిస్తాము. మనలను మనం తక్కువగా ప్రేమించుకొంటే లోకాన్ని ఎక్కువగా ప్రేమించగలము. లోకక్షేమం కోసం చిన్నపనులు చేసినా మీలోని అజ్ఞానం కాలిబూడిద అవుతుంది. నువ్వు ఎవరికైనా ఏదైనా వస్తువు ఇచ్చినా గౌరవంగా ఇయ్యి. మాట మాట్లాడిన గౌరవంగా మాట్లాడు. నీవు ఏ పనిచేసినా పూజభావనతో చెయ్యి.

నీరు అన్నా, వాటర్ అన్నా, తన్నీ అన్నా ఒకేవస్తువుకు పర్యాయపదములు. అలాగే భగవంతుడు సందర్భాన్ని బట్టి ఆత్మ, చైతన్యం, గురువు ఈశ్వరుడు అని చెపుతూఉంటాడు. ఉన్నది ఒక్కటే ఇవి అన్నీ పర్యాయ పదములు. నీకు ద్వైతబుద్ది ఉంది. నీలో ద్వయీభావన ఉన్నంతకాలము నేను శరీరం లోపల ఉన్నాను, శరీరం బయట ప్రపంచం ఉంది, ఎక్కడో వైకుంఠములో దేవుడు ఉన్నాడు అనిపిస్తుంది. నీకు బేదబుద్ది నశించింది అనుకో వైకుంఠము ఇక్కడే దర్శనం ఇస్తుంది. దానికోసం శరీరం మరణించేవరకు ఆగనక్కరలేదు. బేదబుద్ది నశించిన రోజున వైకుంఠము ఇక్కడే మిమ్మల్ని వరిస్తుంది. నీకు బేదబుద్ది ఉంది కాబట్టి గురువును ఆశ్రయించి, గురువుకు సేవచేసి, గురువు అనుగ్రహం సహాయంతో దానిని పోగొట్టుకోమని చెపుతున్నారు. గురువు సత్యం గురించి, ఆత్మగురించి బోధిస్తాడు. నీమనస్సును అంతర్ముఖ పరుస్తాడు. ఇంద్రియ నిగ్రహం నేర్పుతాడు. నీవు అసత్యంమీద ఆధారపడితే ఆ ఆధారాలను ఊడగొడతాడు. నీ ఆధారాలను ఊడగొట్టటం నీమీద కరుణలేక కాదు నీచేత సత్యానుభవం పొందింప చేయటానికి గురువు నీ ఆధారాలను ఊడగొడతాడు. గురువు మిమ్మల్ని ప్రేమిస్తాడు మీతో మాట్లాడుతూఉంటాడు. నీతో మాట్లాడటం ద్వారా నీకు సంతృప్తి కలిగించి, ఆయన మీద నీకు గౌరవం కలిగేటట్లు చేసుకొని నిన్ను హృదయంలోనికి నెట్టుతాడు. భగవంతుడు నీ హృదయంలోనే ఉన్నాడు. వాడిని పొందింపచేయటం కోసం ఎవడైతే సహాయం చేస్తున్నాడో వాడు కూడా భగవంతునితో సమానమే. గురువుకు కూడా ఈశ్వర స్థానము ఇస్తున్నారు. ఏవస్తువును తెలుసుకోవటం వలన ఇంక నీవు తెలుసుకోవలసినది ఏదీ మిగలదో ఆవస్తువు ఎవడైతే అయి ఉన్నాడో వాడే గురువు. లోపల ఉన్న సత్యవస్తువును అనుభవంలోనికి తెచ్చుకొన్నవాడే గురువు. తను ఏస్థితిని అయితే పొందాడో అందరిని ఆ స్థితికి తీసుకొని పోవాలని గురువు చూస్తాడు. వర్షం వచ్చినపుడు భూమి అంతా ఎలా తడుస్తుందో అలాగ లోకాన్ని అంతాశాంతితో తడపాలని గురువు చూస్తాడు. గురువు అంటే చైతన్యమే, శాంతే.

నీకు ఏది అయితే ఇష్టమో దానిని విడవకుండా పట్టుకో, ఒక గురువును గాని, అవతార పురుషుడిని గాని విడవకుండా పట్టుకో, విరళచింతన కాదు సరళచింతన అవసరం. ఎవడైతే భగవంతునికి శరణాగతి పొందాడో వాడిని ఎన్నడూ భగవంతుడు విడిచిపెట్టడు. గురువుకు సేవచేసి నీకు తెలియని విషయాలు ఆయనను అడిగి తెలుసుకో. శీతాకాలంలో నిప్పకు దూరమయితే చలివేస్తుంది. అలాగే వస్తువుకు దూరమయిన కొలదీ నీకు సందేహాలు ఎక్కువుగా వస్తాయి, అవి నిన్ను పీడిస్తాయి. నీ మనస్తత్వానికి తగినట్లుగా గురువు బోధిస్తాడు. గురువు ఆదేశానికి, ఉపదేశానికి భిన్నంగా ప్రవర్తించవద్దు. ఏమార్గం ద్వారా నీకు భగవదనుభవం కలుగుతుందో చూసి ఆరకమైన బోధచేస్తాడు. ఆయన ఉపదేశాన్ని మర్చిపోవద్దు. నీవు భగవంతునిపట్ల అపచారం చేసావు అనుకో గురువు నిన్ను

సరిదిద్దుతాడు, నిన్ను క్షమిస్తాడు. కాని గురువు పట్ల నీవు అపచారం చేస్తే భగవంతుడు కూడా నిన్ను క్షమించడు. గురువు యొక్క దయకు, ప్రేమకు నువ్వు ఎప్పుడైతే అర్హత పరిపూర్ణంగా సంపాదించావో వెంటనే నీ దుఃఖం నశిస్తుంది. గురువును నీవు ఎంతగా ప్రేమిస్తున్నావో అంత ప్రేమ నీ మీద గురువుకు కలిగితే దుఃఖకారణం ఉన్నప్పటికీ వెంటనే దుఃఖం నశిస్తుంది, నశించటమేకాదు నీదుఃఖం అంతా ఆనందంగా, నీ అశాంతి అంతా శాంతిగా మారిపోతుంది. నీకు గురువు మీద ఎంతప్రేమ ఉందో అంత ప్రేమ నీ మీద గురువుకు కలగటానికి తగిన అర్హతను, యోగ్యతను సంపాదించుకో. గురువు అనుగ్రహానికి పాత్రుడైన వాడిని లోకం అంతా విడిచి పెట్టేసినా వాడికి ఏమీ అనిపించదు. ఎర్ర చీమ కుట్టినట్లుగా కూడా అనిపించదు. వాడు స్వతంత్రముగా జీవించగలడు. రోజుమాట్లాడేవారు ఒకరోజు మనతో మాట్లాడకపోతే మనకు టెన్షన్ వచ్చేస్తుంది. కాని కృష్ణుడు ఇంట్లో ఎలాగ ఉంటాడో యుద్ధభూమిలో కూడా అలాగే ఉండేవాడు. ఆయన జీవితంలో ఎక్కడా ఒక్క క్షణం కూడా టెన్షన్ లేదు. ఎప్పుడు చూసినా చిరునవ్వుతో ఉండేవాడు. అహంకారికి టెన్షన్ వస్తుంది గాని నిరహంకారికి టెన్షన్‌రాదు.

నేను ఎప్పుడూ గుడులు చుట్టూ తిరుగవలసిందేనా, నదులలో మునుగుతూ ఉండవలసిందేనా ఎంతవరకూ ఇలా సాధనలు చేయాలి అని అడుగుతున్నాడు. నీవు చేసే సాధన చెయ్యి. ఏదైనా రోగం వచ్చింది అనుకో రోగం తగ్గేవరకూ ఏదోమందు వాడుతూ ఉంటావు, వాడకుండా ఉండలేవు. నీలో అజ్ఞానం ఉన్నంతవరకూ నీవు ఏదో రకమైన సాధన చేయవలసిందే. సాధనయొక్క ప్రయోజనం ఏమిటి అంటే నీమనస్సుకు అంతర్ దృష్టి కలగాలి, నీమనస్సు అణగాలి. నీ మనస్సు అణగకపోతే నీకు జ్ఞానం కలుగదు. పుస్తకాలు చదివి సంపాదించేది జ్ఞానంకాదు. నీలోపల ఉన్న వస్తువు తానుగా వ్యక్తమవ్వటమే నిజమైన జ్ఞానము. పుస్తకాలు చదివి సంపాదించే జ్ఞానం అంతా నీ మనస్సు ఎంతనిజమో అదికూడా అంతే నిజం. కాలక్షేపం కోసం ఏదో బయటవిషయాలు చెప్పకోనే బదులు మంచి గ్రంధాలు చదువుకో. అధ్యయనం విషయంలో ప్రమాదంలో పడకు. నీకు కాలక్షేపం అవ్వటంలేదు అనుకో. నీకు జపం చేయాలి అని అనిపించటంలేదు అనుకో అటువంటప్పుడు నీవు భగవద్గీతగాని, రమణగ్రంధాలుగాని, రామకృష్ణ గ్రంధాలుగాని, విష్ణుసహస్రనామాలు గాని ఇలా నీకు ఏ గ్రంధం చదవాలి అంటే అది చదువుకో. దానివలన నీమనస్సుకు నిర్మలత్వం వస్తుంది. చదివినది నీకు అర్ధమవుతుంది. చదివినది మనకు సరిగా అవగాహన అవ్వకపోవటానికి కారణం ఒక్కటే మనకు ఏకాగ్రత లేకపోవటం. ఈశ్వరానుగ్రహం వలన ఏకాగ్రత వస్తుంది. అధ్యయనమే మిమ్మల్ని సత్యం దగ్గరకు తీసుకొని వెళ్లక పోయినా అధ్యయనం విషయంలో ప్రమాదంలో పడవద్దు. రోజు కొంత టైము మీకు ఇష్టమైన ఆధ్యాత్మిక గ్రంధమును అధ్యయనం చెయ్యండి.